www.prajanaava.in

Telugu Daily

# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
: 99484 33277 / 7288825681

| Special Edition | Special Edition | Special Edition | Special Edition | Special Edition |

సోమవారం | 13 అక్టోబర్, 2025





# భీమన్న ఆలయంలో రాజన్న మొక్కులా?

ఆలయం మూస్తే పంచెలు కట్టుకొని మరీ తలుపులు తెరుస్తాం

## ఫైరింగ్ చేస్తారో.. లాఠీఛార్జి చేస్తారో మీ ఇష్టం.. రెండ్రోజుల్లో నిర్ణయం మార్చుకోకపోతే ఏం చేయాలో అది చేస్తాం

## భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోం: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ అభివృద్ధి పనుల నేపథ్యంలో దర్శనాలు నిలిపివేయనున్నట్లు అధికారులు చేసిన ప్రకటన నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. భీమన్న ఆలయంలో రాజన్న మొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేయడంపై బండి సంజయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజన్న మొక్కులు భీమన్నకు ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆలయం మూసివేస్తే పంచలు కట్టుకుని వచ్చి మరీ ఆలయం తలుపులు తెరుస్తామన్నారు. ఫైరింగ్ చేస్తారో లాఠీచార్జి చేస్తారో చూస్తామని చెప్పారు. ప్రభుత్వానికి రెండ్రోజుల సమయం ఇస్తున్నామని, ఆలోపు ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోకపోతే ఏం చేయాలో అది చేస్తామని హెచ్చరించారు. ఆదివారం బీజేపీ కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి. మేం భక్తులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

- ప్రజానావ, వేములవాడ




- ఆలయ మూసివేత ఉండదు.. స్వామివారికి నిత్య పూజలు కొనసాగుతాయి
- రాజన్నకు మొక్కులు, ఇతర పూజలకు భీమేశ్వరాలయంలో అన్ని ఏర్పాట్లు చేశాం
- ఆలయ అభివృద్ధి, విస్తరణకు అందరూ సహకరించాలి
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

# భక్తుల విశ్వాసాలకు అనుగుణంగానే ఆలయ అభివృద్ధి

ప్రజానావ, వేములవాడ: భక్తుల విశ్వాసాలు, మనోభావాలకు అనుగుణంగా రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు చేపడుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధిపై ఆలయ ఆవరణలోని చైర్మెన్ గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ విప్ ఆదివారం మాట్లాడారు. శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి, వాస్తు, పండితులు, అర్చకులు పట్టణ ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రాజన్న ఆలయ అభివృద్ధికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రూ. 150 కోట్లతో ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు మొదలు అయ్యాయని వివరించారు. రూ. 47 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులు ఇటీవల ప్రారంభించామని వివరించారు. రాజన్న భక్తులకు సులభంగా వేగంగా దర్శనం, వసతి కల్పించాలని ఉద్దేశంతో ఆలయ అభివృద్ధి, విస్తరణ నేపథ్యంలో భీమేశ్వరాలయంలో మొక్కులు, ఇతర పూజలు చేసుకునేందుకు రూ. 3. కోట్ల 48 లక్షలతో ఏర్పాట్లు చేశామని తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు యథావిధిగా అన్ని పూజలు, అభిషేకాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. రాజన్న ఆలయంలో భారీ యంత్రాలతో పనులు జరిగే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. భక్తుల భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయంగా భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ అనేది భక్తుల ఎజెండా అని పేర్కొన్నారు. భక్తుల కోసం ఎవరు ఎలాంటి సూచనలు చేసిన తప్పకుండా గౌరవిస్తామని స్పష్టం చేశారు. అందరి సలహాలు, సూచనల మేరకు పనులు చేపడుతామని విప్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చేయిస్తున్న పనులకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, ఆలయ ఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అంత తొందరెందుకు?

- ఏర్పాట్లు పూర్తిచేయకముందే భీమన్న గుడిలో ఎలా దర్శనాలు కల్పిస్తారు?
- సమ్మక్క సారక్క, మహాశివరాత్రి తర్వాతే అభివృద్ధి చేయాలి
- బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్

ప్రజానావ, వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయం నుంచి అంత తొందరగా ఉత్సవమూర్తులను తరలించాల్సిన అవసరం ఏముంది? రానున్న కార్తీకమాసం, సమ్మక్క సారక్క, మహా శివ రాత్రి జాతర తర్వాత రాజన్న ఆలయ అభివృద్ధిని కొనసాగిస్తూ పనులు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అభివృద్ధి పేరిట భీమేశ్వర ఆలయంలో భక్తులకు వసతులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు ఉన్నాయా అని నిలదీశారు. ఎలాంటి ఏర్పాట్లు పూర్తికాకముందే భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఎలా కల్పిస్తారని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో వసతులు ఏర్పాటు చేసిన తర్వాత తరలించాలని డిమాండ్ చేశారు. అసలు భీమన్న గుడి ఆలయ అభివృద్ధి పనులు పూర్తిచేసిన తర్వాతే దర్శనాలు కొనసాగించాలన్నారు. ఇప్పుడే ఏం తొందర లేదని ఇంకా చాలా సమయం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో రాజన్న భక్తులపై ఆధారపడిన దాదాపు 5వేలకు పైగా చిరువ్యాపారుల పొట్టకొడుతామంటే ఊరుకోబోమని, వారిని ఆదుకోవాలని కోరారు. అంతకుముందు భీమేశ్వర ఆలయంలో భక్తులకు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కోడె మొక్కు, అర్జిత సేవల భక్తులకు ఏర్పాటుచేసిన వసతులను బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి పరిశీలించారు.

